క్లుప్తంగా

## మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి



ఆత్మకూర్: ఆత్మకూర్ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో ముందుకెళ్తున్నామని చైర్మన్ రహమతుల్లా అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రహ్మతుల్లాను సన్మానించారు. యార్డు కొత్త భవనం కోసం రూ.80 లక్షలతో ప్రతిపాదనలు చేశామని, అలాగే యార్డులో 200 షాపులను నిర్మించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అనుమతులు రానున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, దామోదర్, సాయిరాఘవ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల పంపిణీ



వనపర్తిటౌన్: ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రజల సంక్షేమానికి అహర్నిశలు పని చేస్తున్నాడని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందించేందుకు అనునిత్యం కృషి చేస్తున్నాడని చెప్పారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని 4వ వార్డులో మాజీ కౌన్సిలర్ పద్మ, పరుశురాం రేషన్ కార్డులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి వాళ్లు లబ్ధి చెందారు తప్పా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, డీలర్ రాంరెడ్డి, నక్క రాములు, మిరియాల వెంకట్రాములు, బొప్పల రాములు తదితరులు పాల్గొన్నారు

## సమాజంపై అవగాహన కల్పించాలి



ఖిల్లాఘనపురం: శిశుమందిర్‌కు వచ్చే విద్యార్థులకు చిన్న వయసు నుంచే సమాజంపై అవగాహన కల్పించాలని, వారికి మంచి చెడుపై మార్గనిర్దేశం చేయాలని వీహెచ్‌పీ జిల్లా ప్రముఖ్ రాచాల జనార్దన్, పల్లాటి నాగయ్య అన్నారు. మండలకేంద్రంలోని శిశుమందిర్‌లో బలసంస్కారాల, బాలబాలికల సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిశుమందిర్‌కు విద్యార్థులకు చిన్ననాటి నుంచే దేశంపై గౌరవం, తోటి ప్రజల పట్ల ప్రేమా అనురాగం, మంచి నడవడిక అలవర్చుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్కార శిక్షణ విభాగ్ మండల ప్రముఖ్ జ్యోతి పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతనే కృష్ణుడి బోధ



కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత భగవద్గీతనే శ్రీకృష్ణుడి నిజబోధ అని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో భగవద్గీత అనుబంధ గ్రంథాలను ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈనెల 16 నుంచి 18వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సంబంధించి పట్టణ వాసులకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. శ్రీకృష్ణుడు మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, జహంగీర్, శివ, సిమ్మయ్య తదితరులు ఉన్నారు.

## బీఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడిగా తిరుపతి

కొత్తకోట రూరల్: బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) మండల అధ్యక్షుడిగా కానాయపల్లి గ్రామానికి చెందిన తిరుపతిని నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు రాజేష్‌కు, రాష్ట్ర కార్యదర్శి తోలు రాముకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి ఉంటుందన్నారు.

# రైతన్నకు పరిహారం అందేనా..?

- వర్షాలకు 123 ఎకరాల పంటనష్టం
- రూ.10వేలు ప్రకటించిన ప్రభుత్వం
- అధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ



హీర్లతాండాలో పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



సల్కెలాపురంలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖిల్లాఘనపురం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం, వడగళ్ళ వానకు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరో 20 రోజుల్లో పంట చేతికి వస్తుందని ఆశపడిన రైతుల ఆశలు అడియాశలైనాయి. పాడైన పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు నివేదికలు తయారు చేసి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. కాని ఇప్పటివరకు రైతులకు పరిహారం అందక పోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

**123 ఎకరాల్లో నష్టం..**

మండలంలో యాసంగి పంటలు సాగు చేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు చేతికి వచ్చే సమయంలో కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో ముఖ్యంగా అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, సల్కెలాపురం, ఖిల్లాఘనపురం, పర్వతాపురం గ్రామాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వాన ప్రభావం ఎక్కువగా కనిపించింది. 6 గ్రామాల్లో 63 మంది రైతులకు సంబంధించిన వరి పంట 73ఎకరాల్లో పాడైనట్లు వ్యవసాయ అధికారులు చెప్పారు. అదే విధంగా మొక్కజొన్న 14 మంది రైతులకు సంబంధించి 22ఎకరాల్లో, ఆరుమందికి సంబంధించి 28 ఎకరాల్లో మామిడితోటల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. మొత్తంగా 123 ఎకరాల్లో పలురకాల పంటలు, మామిడితోటలు పాడైపోయినట్లు తెలిపారు.

**పంటలను పరిశీలించిన అధికారులు..**

అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లకు దెబ్బతిన్న పంటలను అప్పట్లో వ్యవసాయ అధికారులు గ్రామాల పరిధిలో పర్యటించి అన్నిరకాలా పంటల నష్టాన్ని గుర్తించడం జరిగింది. పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి ఉన్నతస్థాయి అధికారులకు పంపడం జగిందని ఏఓ చెప్పారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం రాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**పాడైపోయింది**



సల్కెలాపురం గ్రామ శివారులో యాసంగి పంటగా మొక్కజొన్న పంటను సాగు చేశాం. పెద్దఎత్తున ఈదురుగాలులు, వడగండ్ల వాన కురవడంతో నాలుగు ఎకరాల పంట మొత్తం నేలకొరిగి పాడైపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామని చెప్పింద్రు ఇప్పటివరకు రాలేదు. అగ్రికల్చర్ సారువాల్లు కూడా వచ్చి మా పంటను చూసి పోయింద్రు ఇప్పటికైనా నష్ట పరిహారం వచ్చేలా చూడాలి

– కొత్త గొల్ల మల్లయ్య, అప్పారెడ్డిపల్లి

**నివేదికలు పంపాం..**



మండలంలో రబీలో అకాల వర్షాలకు వరి, మొక్క జొన్న పంటలు పాడైపోయాయి. మామిడితోట ల్లో కాయలు మొత్తం రాలి రైతులకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం సూచనల మేరకు పరిశీలించి నివేదికను తయారు చేసి పై అధికారులకు పంప డం జరిగింది. ప్రభుత్వం త్వరలోనే నష్టపరి హారం అందించేందుకు చర్యలు తీసుకుంటుంది.

– మల్లయ్య, వ్యవసాయాధికారి, ఖిల్లాఘనపురం

# కేజీబీవీ పరిసరాల్లో మురుగుతో అవస్థ



పాన్‌గల్ కస్తూర్బా వంటగది పక్కనే నిల్వ ఉన్న మురుగు



చెత్త, పిచ్చిమొక్కలు ఇలా...

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం నుంచి వెలువడే మురుగు నీటికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో విద్యాలయం పక్కనే మురుగునీటి నిల్వతో దుర్వాసన వెదజల్లుతుండటంతో విద్యాలయం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నిల్వతో ఈగలు, దోమలు వృద్ధి చెందడం, వరాహాల సంచారంతో రోగాలు సంభవించే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యాలయం వంటగది పక్కనే మురుగు నీరు నిల్వ, ప్రహరీ గోడ పరిసరాల్లో లోపించిన పారిశుద్ధ్యంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముందే వర్షాకాలం కావడంతో మురుగు నీటి నిల్వ, పరిసరాల అపరిశుభ్రంతో దుర్వాసనతో ఎప్పుడు ఏ రోగాలు సంభవిస్తాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై కస్తూర్బా ఎస్‌ఓ హేమాలతను వివరణ కోరగా విద్యాలయం నుంచి వెలువడే మురుగునీటికి సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకవెళ్ళడం జరిగిందన్నారు. మరోమారు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



38 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వనపర్తిటౌన్: 1986–87 బ్యాచ్‌కు చెందిన జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని చిట్యాల చౌరస్తాలోని ఫంక్షన్ హాల్ ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కలిశారు. 38 ఏళ్ల తర్వాత వారు కలుసుకొని మాట్లాడుకున్నారు. స్నేహాన్ని గుర్తుచేసుకొని ఆనందోత్సవాల మధ్య సమయాన్ని గడిపారు. ఒకరి కుటుంబ పరిస్థితులు మరొకరు తెలుసుకుంటూ, ఆర్థిక ఇబ్బందులను పంచుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి స్నేహితులకు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అదే విధంగా వారి బ్యాచ్‌లోని స్నేహితులు 23 మంది చనిపోవడంతో వారికి 2 నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోల్డ్ అనిల్ కుమార్, వైలు వెంకటేష్, చందు, రాము, నరేష్, డి.కిరణ్ కుమార్, అద్వాని శ్రీనివాసులు, గట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి సరుకుల అందజేత



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వృద్ధ అనాథ ఆశ్రమానికి స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మిత్రబృందం సరుకులను వితరణగా అందజేశారు. పాన్‌గల్‌కు చెందిన 1992–93వ సంవత్సరం పదోతరగతి పూర్వవిద్యార్థుల మిత్రబృందం కలిసి 150 కేజీల బియ్యం, ఉప్మారవ్వ, పప్పు, నూనెలు రెండునెలలకు సరిపడా రూ.15వేల విలువైన సరుకులను ఆశ్రమానికి అందజేశారు. పూర్వ విద్యార్థుల మిత్రబృందాన్ని ఆశ్రమ నిర్వాహకుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, శ్రీనివాస్, కురుమన్న, ప్రభాకర్, మాసన్న, బాలేమియ్యా పాల్గొన్నారు.

## జూరాలకు ‘శ్రావణం’ ఎఫెక్ట్




ప్రియదర్శిని జూరాల జలాశయం ఎడ మ కాల్వ వద్ద ఉన్న చేప వంటకాల విక్రయ కేంద్రా లు ఆదివారం వెలవెలబోయాయి. సెలవురోజు కావడంతో జలాశయం పరవళ్ల తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చినా శ్రావణమా సం ఉండటంతో తక్కువమందే ఆరగించడం కనిపించింది. గిరాకీ అంతంత మాత్రంగానే ఉందని హోటళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. – అమరచింత




# క్షేత్రస్థాయి పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి

వీపనగండ్ల: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి ప్రజా పోరాటాలు నిర్వహిద్దామని జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కామ్రేడ్ నర్సింహ భవన్ వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే పలు చట్టాలను అమల్లోకి తెచ్చిందని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి నిధుల కేటాయింపులో కోత విధించిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలిపిస్తామని హామీ ఇచ్చి మరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య, జేవీవీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జితేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది, స్థానిక నాయకులు ఆశన్న, మురళి పాల్గొన్నారు.

# అంధ విద్యార్థులకు సహకారం



పవన్‌ను అభినందిస్తున్న వాసవిక్లబ్ నిర్వాహకులు

ఆత్మకూర్: అంతర్జాతీయ గోల్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన సమ్మిళిత ఫౌండేషన్ విద్యార్థి పవన్‌కల్యాణ్, భారతజట్టు కోచ్‌గా ఎంపికైన సంస్థ డైరెక్టర్ శివకుమార్‌లను వాసవిక్లబ్ నిర్వాహకులు సన్మానించారు. ఆదివారం సంఘం సభ్యులు సన్నబియ్యంతో పాటు నగదును అందజేశారు. ఈజిప్టు దేశంలో సెప్టెంబర్ మొదటివారంలో జరిగే గోల్‌బాల్ క్రీడల్లో పవన్ క్రీడాకారుడిగా, శివకుమార్ కోచ్‌గా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు రామ్మోహన్, యశ్వంత్, భరత్, నీలేష, నవీన్, రాఘవేందర్, రాజేష్, శ్రీధర్ ఉన్నారు.

# కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు క్యామ భాస్కర్ తెలిపారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారాన్ని కరపత్రాలను పంచుతూ కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రేషన్‌షాపుల ద్వారా ఇస్తున్న ఉచిత బియ్యంలో వాట, ఇందిరమ్మ ఇళ్లలో వాట ఎంత ఉందనే విషయాలను వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాండు,గోపి, కృష్ణమూర్తి, బాలరాజు తదితరులు ఉన్నారు.

# అమరచింత పెద్ద చెరువును నీటితో నింపండి



రైతులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

అమరచింత: భూత్పూరు రిజర్వాయర్ ఎడమ కాల్వ ద్వార అమరచింత పెద్ద చెరువుకు నీటితో నింపుతూ పంట సాగుకు నీటిని అందించేలా కృషి చేయాలంటూ మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డిని కలిసి రైతులు సమస్యను విన్నవించారు. ఈ మేరకు ప్రకాష్‌రెడ్డి సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి కాల్వ ద్వారా నీటి సరఫరాలో ఎందుకు అంతరాయం వస్తుందని అడిగారు. కాల్వలో జమ్ము, ముళ్ళపొదలు పెరిగాయని దీంతో నీటి సరఫరా ముందుకు వెళ్లడంతో అలస్యమవుతున్నదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాల్వలోని జమ్ము తొలగించేందుకు అయ్యే ఖర్చును రైతుల పక్షాన తను సొంతంగా చెల్లిస్తానని మరమ్మతులు చేపట్టమని ప్రకాష్‌రెడ్డి అధికారులకు వివరించారు. దీంతో సోమవారం కాల్వను సందర్శించి జేసీబీ ద్వారా జమ్ము తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కోదండరాంరెడ్డి, జయసింహారెడ్డి, ఎస్‌ఎ.రాజు,శ్యామ్‌తో పాటు పిన్నంచర్ల, పాంరెడ్డిపల్లె రైతులు పాల్గొన్నారు.

# వీరశైవ లింగాయత్ మండల కార్యవర్గం ఎన్నిక



సమ్మేళనంలో పాల్గొన్న లింగాయత్‌లు

ఖిల్లాఘనపురం: మండల వీరశైవ లింగాయత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో వీరశైవ లింగాయత్ సమాజం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి హాజరైన వారు మాట్లాడుతూ.. పరిచయం చేసుకోవడంతో పాటుగా వారి కుటుంబ వివరాలు చెప్పుకొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా కె.వీరభద్రయ్య, ఉపాధ్యక్షుడిగా ఆర్.చంద్రశేఖర్, శంకర్, లింగం. ప్రధాన కార్యదర్శిగా పత్తి రాజ్‌కుమార్, కోషాధికారిగా బల్లె పరుషవేది లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విదంగా మండల మహిళా కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. అధ్యక్షులుగా పత్తి మాధురి, ఉపాధ్యక్షుడిగా బల్లె శశికళ, ప్రధాన కార్యదర్శి శేఖ, కోషాధికారి శెట్టి మాదురిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మండల అధ్యక్షుడు వీరభద్రయ్య తెలిపారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వీరశైవ లింగాయత్‌లు తదితరులు పాల్గొన్నారు.

# వరాహాలకు ఆవాసంగా పొల్కిచెరువు

- పరిసరాల్లో దుర్వాసనతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- వ్యాధులు ప్రబలే అవకాశం



పొల్కిచెరువు నీటిలో పందుల గుంపు

పాన్‌గల్: మండలకేంద్రంలో పొల్కిచెరువు నీటిలో, పరిసరాలు పందులకు నిలయాలుగా మారాయి. గ్రామానికి చెందిన అనేక వరాహాలను చెరువు పరిసరాల్లో ఆవాసం ఏర్పాటు చేసి వాటికి తినుబండరాలను వేస్తుండటంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు వరాహాలు చెరువు నీటిలో ఉండడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. సమీపంలోనే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు ఉన్న ఆయా అధికారులు చెరువు సమీపం నుంచే ప్రతీనిత్యం వెళ్తున్న వరాహాల సంచారం, దుర్వాసన వెదజల్లుతున్న వీటి గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పందుల యజమాని తన ఇష్టానుసారంగా చెరువు పరిసరాల్లో తినుబండరాలను వేస్తూ మేపుతున్నాడని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతోపాటు చెరువులో చేపలకు కూడా హానీ జరిగే ప్రమాదముందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువునీరు కలుషితం కాకముందే పందుల సంచారాన్ని నిరోధిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, మత్స్యకారులు కోరుతున్నారు.



చెరువులో అపరిశుభ్రంగా మారిన దృశ్యం